# ప్రత్తిపాటి పుల్లారావు జన్మదినోత్సవం సందర్భంగా 43వ ఉచిత కంటి వైద్య శిబిరం : డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 21 : చిలకలూరిపేట: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆధ్వర్యంలో, సహకారంతో ఈ నెల 29వ తేదీ శుక్రవారం 43వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు(కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్) తెలిపారు. డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు మాట్లాడుతూ, సాధారణంగా చాలామంది కంటి సమస్యలు అంటే కేవలం చుక్కలాలు (క్యాటరాక్ట్) మాత్రమే అనుకుంటారని, కానీ కంటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు అంతటితో ముగియవని పేర్కొన్నారు. రెటీనా సమస్యలు, కంటి పొర సంబంధిత వ్యాధులు, గ్లాకోమా (నీటికాసులు), చూపు మందగించడం, కంటి ఇన్ఫెక్షన్స్ వంటి అనేక సమస్యలకు ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని వివరించారు. ఈ 43వ కంటి వైద్య శిబిరంలో కంటి చూపుకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, అవసరమైన వైద్య సలహాలు, చికిత్సలు, గ్లాసులు, కంటి ఇంజక్షన్లు, శస్త్రచికిత్సల కోసం అవసరమైన మార్గదర్శకాలు అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా శిబిరానికి వచ్చే వారికి "మళ్లీ రండి, తర్వాత రండి" అనే ఇబ్బందులు లేకుండా, అవసరమైన చికిత్సలను వీలైనంత త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. శిబిరం ప్రత్యేకత ఏమిటంటే, ఓపీ , అవసరమైన శస్త్రచికిత్సలు, రెటీనా సమస్యలు, కంటి నీటికాసులు, చూపు లోపాల చికిత్సలను సమర్థవంతంగా తక్కువ సమయంలో అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వందల సంఖ్యలో ప్రజలు వచ్చినా ఎలాంటి అసౌకర్యం లేకుండా వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్స ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా ఖర్చులు, భోజన సదుపాయాలు తదితర అవసరాలను కూడా నిర్వాహకులు పూర్తిగా ఉచితంగా కల్పిస్తున్నట్లు డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ప్రారంభ దశలోనే



సమస్యలను గుర్తించి చికిత్స పొందితే చూపును కాపాడుకోవచ్చని డాక్టర్ కొమ్మినేని వీరశంకర్ రావు సూచించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రత్తిపాటి శరత్ ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి పర్యవేక్షణలో ఈసారి శిబిరం గతంలో కంటే మరింత విజయవంతంగా నిర్వహించబడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

# జగన్ నిరాధార ఆరోపణలు... ఎందుకూ పనికిరాని రాజకీయ ప్రకటనలు : ప్రత్తిపాటి

## ప్రజల నాడి గ్రహించలేని నాయకుడు రాజకీయాలకు అనర్హుడు అనేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, పెన్ పవర్, మే 21 : చిలకలూరిపేట : అవినీతి, దోపిడీతో పాటు.. అసత్యాలు, అబద్ధాల్లోనూ తనదే పై చేయి అని జగన్ నిరూపిస్తున్నాడు. పార్ట్ టైమ్ రాజకీయాలు.. ఫుల్ టైమ్ ఎంజాయ్ మెంట్ తో అటు బెంగుళూరుకు, ఇటు తాడేపల్లికి తిరగలేక అష్టకష్టాలు పడుతున్న జగన్.. ప్రజలు కష్టాలు పడుతున్నారనడం హాస్యాస్పదంగా ఉంది. ప్రజల నాడి గ్రహించలేని నాయకుడు రాజకీయాలకు అనర్హుడు అనేందుకు జగనే ప్రత్యక్ష నిదర్శనం. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేస్తున్న నిరాధార ఆరోపణలు తన రాజకీయ అసమర్థతకు ప్రబల నిదర్శనాలు. 2019 ఎన్నికల్లో జగన్ వాగ్దానాలు కోటలు దాటితే.... గడప కూడా దాటలేదు. ఐదేళ్లలో ఎప్పుడైనా హామీలు అమలు చేయొచ్చని అధికారాంతం వరకు ప్రజల్ని వంచించిన జగన్.. 20 నెలల్లో 90 శాతం హామీలు అమలు చేసిన చంద్రబాబు సమర్థతను తప్పుపట్టడం సిగ్గుచేటు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. పాలనా వైఫల్యాలపై జగన్ ఎప్పటిలానే పచ్చి అబద్ధాలు చెప్పారు. తన నియంత్రత్వ, విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని రాతియుగంలోకి తీసుకెళ్లింది జగన్ కాదా? తన పిచ్చి నిర్ణయాల ప్రయోగశాలగా రాష్ట్రాన్ని, ప్రజల్ని ప్రయోగ వస్తువులుగా మార్చిన అసమర్థ పాలకుడిగా జగన్ శాశ్వతంగా రాష్ట్ర రాజకీయ చరిత్రలో నిలిచిపోతాడు. రివర్స్ పాలన.. ప్రశ్నిస్తే దండనలు.. బటన్ నొక్కుడు, సంక్షేమం ముసుగులో రాష్ట్రంపై అప్పులభారం.. దోపిడీలు, దౌర్జన్యాలే జగన్ ఐదేళ్లపాటు ప్రజలకు అందించిన పాలనా ఫలాలు. కూటమి ప్రభుత్వం చేస్తున్న



అభివృద్ధి.. తెచ్చిన పెట్టుబడులు, సంస్థలు.. పరిపాలనా మార్పులు.. అమరావతి, పోలవరం నిర్మాణ పురోగతిని స్వాగతిస్తే ప్రజల్లో చులకన అవుతాన్నదే జగన్ భయం. తండ్రి, బాబాయ్ లపై జగన్ కు ఉన్న ప్రేమ, కుటుంబ మర్యాద, విలువలపై ఆయనకున్న గౌరవం.. ప్రజల కంటే ఆయన తల్లీచెల్లికే బాగా తెలుసు." అని ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు.

# డాక్టర్ సుధాకర్ బాబు వర్ధంతి

## ఘనంగా నివాళులర్పించిన కూటమి నాయకులు

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 21 : చిలకలూరిపేట : పట్టణంలోని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో డాక్టర్ సుధాకర్ బాబు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. వైద్యుడిగా సమాజానికి ఆయన అందించిన విశిష్ట సేవలను, పేద ప్రజలకు అండగా నిలిచిన తీరును నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వృత్తిని సేవగా భావించి ఎన్నో కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించిన గొప్ప మనసున్న వ్యక్తి డాక్టర్ సుధాకర్ బాబు అని, ఆయన మరణం వైద్య రంగానికే కాకుండా సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాల్లో ముందుండే ఆయనలాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో ఆదర్శమన్నారు.అదేవిధంగా, కరోనా కష్టకాలంలో వైద్య సిబ్బందికి కనీస సౌకర్యాలైన మాస్కులు కావాలని అడిగినందుకే, నాటి వైసీపీ పాలకులు దానిని పెద్ద నేరంగా చిత్రీకరించి ఆయనను మానసికంగా, శారీరకంగా చిత్రహింసలకు గురిచేశారని నాయకులు మండిపడ్డారు. విశాఖపట్నం నడిరోడ్డుపై ఆయన చేతులు విరిచి అమానుషంగా ప్రవర్తించి, చివరకు ఆయన మరణానికి కారణమయ్యారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వ దుర్మార్గానికి వ్యతిరేకంగా ప్రజల్లో వచ్చిన తిరుగుబాటే నేడు కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి రావడానికి ముఖ్య కారణమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీలో కొనసాగుతున్న ఎస్సీ సోదరులుఈనిజాలనుగమనించి,



ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నివాళి కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండా వీరయ్య, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుల్లి చిన్న బాబు పాల్గొన్నారు. వారితో పాటు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అంబటి సొంబాబు, సీనియర్ నాయకులు తోట బ్రహ్మ స్వాములు, క్లస్టర్ ఇంచార్జ్ కేబి రోడ్డు మస్తాన్ వలి, కో-క్లస్టర్ ఇంచార్జ్ నందనం చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, యూనిట్ ఇంచార్జ్ పిల్లి లెనిన్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విజయవాడ, పెన్ పవర్ మే 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవం--2026 సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ యోగా ద్వారా స్థిరమైన భవిష్యత్తు సాధ్యమని పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధి పెరిగినా, జీవనశైలి లోపాలు, మానసిక ఒత్తిడి, పర్యావరణ క్షీణత వంటి సమస్యలు మానవాళికి సవాలుగా మారాయని ఆయన తెలిపారు. ఈ పరిస్థితులకు మితిమీరిన వినియోగమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన 'మిషన్ లైఫ్' భావనను ప్రస్తావిస్తూ, ఆలోచనాత్మకమైన వినియోగం, ఇంధన పొదుపు, అనవసర ఖర్చుల నియంత్రణ వంటి అంశాలు ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలని సూచించారు. యోగ తత్వశాస్త్రంలోని 'అపరిగ్రహం', 'సంతోషం' వంటి సూత్రాలు మనుషులను సంయమనంతో కూడిన జీవన విధానం వైపు నడిపిస్తాయని చెప్పారు. యోగా కేవలం ఆరోగ్య సాధన మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు మార్గదర్శకమని మంత్రి అభిప్రాయపడ్డారు. యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత, స్వీయ క్రమశిక్షణ పెరుగుతాయని, దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగా భారతదేశం అందించిన గొప్ప కానుకగా నిలిచిందని, ఆరోగ్యం, సామరస్యం, స్థిరమైన జీవన విధానానికి ఇది ప్రతీకగా మారిందన్నారు. ఈ యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా, బాధ్యతాయుతమైన జీవన విధానానికి సంకల్పంగా స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



# గార్డ్స్ ఆధ్వర్యంలో ఊషో శిక్షణార్థులకు పౌష్టికాహారం పంపిణీ

చిలకలూరిపేట , పెన్ పవర్, మే 21 : చిలకలూరిపేట : పట్టణంలోని సి.ఆర్. క్లబ్ ప్రాంగణంలో విద్యార్థులకు ప్రతిరోజూ ఉచితంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అందిస్తున్న న్యూ షావులిన్ కుంగ్ ఫు అకాడమీకి ప్రభుత్వం ఊషో శిక్షణ నిర్వహణకు అనుమతి మంజూరు చేసింది. స్పోర్ట్స్ అథారిటీ పర్యవేక్షణలో విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి రెండు గుడ్లు, పావు లీటర్ పాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ



మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ బలవర్ధక ఆహారం అందించడం అవసరమని తెలిపారు. ఇందుకు సహకారం అందిస్తున్న గార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు, గార్డ్స్ కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు షేక్ బాజీ, దార్ల బుజ్జిబాబు, అకాడమీ ప్రతినిధులు బత్తుల విక్రమ్, ఎడ్ల సురేష్, షేక్ ధరియవలి, బ్రహ్మం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా హృదయ సజీవుడు మన రాజీవుడు

## పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ



చిలకలూరిపేట , పెన్ పవర్, మే 21 : చిలకలూరిపేట : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త ఎం. రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లో దేశ పాలనా పగ్గాలు చేపట్టిన రాజీవ్ గాంధీ, తన రాజనీతిజ్ఞతతో అద్భుతమైన ప్రజాపాలన అందించి ప్రజల హృదయాల్లో సజీవుడిగా నిలిచారని కొనియాడారు. సాంకేతిక నిపుణుడు శ్యామ్ పిత్రోడా సహకారంతో దేశంలో సమాచార సాంకేతిక (ఐటి) రంగానికి బీజం వేసి, 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పితామహుడు'గా నిలిచారన్నారు. అలాగే 'జవహర్ రోజ్‌గార్ యోజన' ద్వారా ఢిల్లీ నుండి నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలకే నిధులు పంపిస్తూ గ్రామసీమల అభివృద్ధికి బంగారు బాటలు వేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఉప్పుటూరి అనిల్ కుమార్, మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ నసురుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెం నర్సిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు ఇంటూరి భవాని వెంకటేష్, గోవిందు ప్రభాకర్, మండల అధ్యక్షులు సాగి నరసింహారావు, తనుబొద్ది సాంబశివారెడ్డి, అల్లం సుబ్బారావు, కారుచోల స్వప్న కుమార్, ఎప్పాల అంజిరెడ్డి, దాసరి శ్యాంబాబు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగ పరుచుకోవాలి-తూనుగుంట్ల సాయిబాబా

భట్టిప్రోలు, పెన్ పవర్,మే, 21: రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులు అందిస్తున్న రాయితీలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. గురువారం మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామంలోని భట్టిప్రోలు రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం మండల వ్యవసాయం అధికారి బి బ్రహ్మరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ,నేల ఆరోగ్యం-పరిరక్షణ ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తుందని తెలిపారు.పచ్చిరొట్ట పైర్లను సాగు చేయుట ద్వారా నేల సారవంతం అవుతుందని తద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించవచ్చని అన్నారు. ఈ సంవత్సరం భట్టిప్రోలు మండలానికి 20క్వింటాళ్ళ జీలుగ, 30 క్వింటాళ్ళ జనుము,40 క్వింటాళ్ళ పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.ప్రతీ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో ఇవి అందుబాటులో ఉన్నాయని,ఆయా గ్రామాల రైతులు రైతు సేవా



కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ముఖ్యఅతిథి సాయిబాబా మాట్లాడుతూ, రైతుల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని వ్యవసాయ అధికారిని కోరారు. అనంతరం గ్రామ రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు డి. నాగూర్ వలీ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో నిత్య యోగా సాధన ప్రారంభం

## ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, పెన్ పవర్ మే 21: యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆనందం కలుగుతుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెలశివప్రసాదరావు స్టేడియంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఆధ్వర్యంలోనిత్య యోగాసాధన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన సందర్భంగాఆయన మాట్లాడారు. యోగా చేయడం వల్లశారీరకంగా,మానసికంగాఆనందంగా, ఆరోగ్యంగా, యవ్వనంగా ఉండవచ్చు అని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిరం నిర్వాహకులు, ఆయుష్ యోగా టీచర్ కనమర్లపూడి శారద, ఆనంద రాముడు, సుబ్బారావు తదితరులు పాల్గొని యోగా క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసులలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

